నవతెలంగాణ
ఆదిలాబాద్
గురువారం | అక్టోబర్ 03, 2024 | www.navatelangana.com

స్టీలు బ్యాంకులను ప్రారంభించిన ఎంపీఓ

నవతెలంగాణ-లోకేశ్వరం



మండల కేంద్రంతో పాటు మన్మథ్, నగర్, గడ్చంధా గ్రామలలో బుధవారం స్టీల్ బ్యాంకును ఎంపీఓ సోలమాన్ రాజ్ ప్రారంభించారు. ఈ క్రమంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించేందుకు ఈ స్టీల్ బ్యాంకులను గ్రామంలోని దాతల సహాయంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటి ఏర్పాటుకు సహకరించిన దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ స్టీల్ బ్యాంకును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచయతి కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో గల లైబ్రరీ స్టడీ హాల్ విద్యార్థులకు ఉచితంగా తొమ్మిది నెలల కరెంట్ అఫైర్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. బుధవారం స్టడీ సర్కిల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరీంనగర్ అసోసియేట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ పాల్గొని ఆయన తరపున ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు 70 మంది విద్యార్థులు, డీఎస్సీ బయోలాజికల్ సైన్స్‌లో ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు ర్యాంకులు సాధించిన అభ్యర్థులు పాల్గొన్నారు.

అరులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటు హక్కు కోసం తప్పకుండ దరఖాస్తులు చేసుకోవాలని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ కోరారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో పట్టభద్రుల ఓటర్లను కలిసి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే నిరుద్యోగుల, ఉద్యోగుల సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల యువకులు గుగ్గిలా స్వామి, బొప్పారపు నగేష్, రాజు, కిరణ్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్టీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో యంగ్ ఉమెన్స్ జిల్లా కమిటీ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యంగ్ ఉమెన్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు చాపిడి శ్రావణి అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లను పుట్టనిద్దాం, బ్రతకనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం అనే నినాదంతో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో మహిళలపై దాడులు రోజురోజులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాలు మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, అమ్మాయిలకి రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టికనంద్, గోడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, యంగ్ ఉమెన్ జిల్లా కో కన్వీనర్లు కుందురపు మంజుల, చిట్టి, అక్షయ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చటరీ భీంరావ్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు దుర్గం రాజ్ కుమార్, వడ్లూరి శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, జిల్లా కమిటీ సభ్యులు జాడి తిరుపతి, జిల్లా నాయకులు తిరుపతి, మనోహర్ రాజు, పూజ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ అల్బర్ట్ అన్నారు. గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలపై ఆయన చర్చించి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు.

మెడికల్ అన్‌ఫీట్ కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

కారుణ్య నియామకాల కింద అన్‌ఫిట్ అయిన కార్మికులకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా తరపున గోలేటిలోని యూనియన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి కారణాధం వెంకటేశం, మైన్స్ కమిటీ మెంబర్ దాసరి బాబురావు హాజరై కార్మికులకు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్‌రాజ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకటేశం, బాబురావు సేవలు ఎనలేనివని ఇటు కార్మిక వర్గానికి అటు యూనియన్ కార్యక్రమాలలో ఎంతో చురుకుగా పాల్గొనేవారని, వారు లేని లోటు యూనియన్‌కు తీర్చలేనిదన్నారు. శేష జీవితం ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాలు చంద్రశేఖర్, సత్యనారాయణ, కిరణ్, ఏరియా కార్యదర్శులు మారిన వెంకటేష్, అలివేణి సంపత్, ఫిట్ కార్యదర్శిలు గాజేయిని శ్రీనివాస్, పోగుల గణపతి, మెరుగు రమేష్, నాయకులు కాగిత స్వామి, చందర్, దుంపల బాపు, చంద్రయ్య పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికల మండల ఇన్‌చార్జిగా కదం సంతోష్

నవతెలంగాణ-ముథోల్

ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ముథోల్ మండల ఇన్‌చార్జిగా ముథోల్‌కు చెందిన కదం సంతోష్ పటేల్‌ను నియమిస్తూ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శ పైడిపల్లి గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా బుధవారం ఆయన మాట్లాడారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు, సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. తనను ఇన్‌చార్జిగా నియమించినందుకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి, బీజేపీ ముథోల్ అసెంబ్లీ, జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కదం సంతోష్ పటేల్‌ను మండల బీజేపీ అధ్యక్షుడు కోరి పోతన్న, మండల నాయకులు సప్పటోల్ల పోతన్న, పలువురు నాయకులు అభినందించారు.

14లోగా ఏకరూప దుస్తులు అందజేయాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏక రూప దుస్తులు ఒక జత ఈ నెల 14వ తేది లోగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మహిళా శక్తి కుట్టు కేంద్రాల ద్వారా ఆయా పాఠశాలలకు సంబంధించిన ఏకరూప దుస్తుల స్టిచింగ్‌పై సమావేశం నిర్వహించారు. ఆయా శాఖలకు చేరుకున్న క్లాత్‌ను విద్యార్థుల వారీగా కొలతలు తీసుకుని, మహిళా శక్తి కుట్టు కేంద్రాలకు దుస్తులు కుట్టుటకు అప్పగించాలని డీఆర్డీఓ, మేప్మాను ఆదేశించారు. బేల, జైనథ్, నర్సాపూర్, బట్టిసవర్గాం, పాఠశాలలకు సంబంధించి ఒక జత అక్టోబర్ 14 లోపు ఏకరూప దుస్తులు అందించాలని మిగితా 2, 3 జతల ఏకరూప దుస్తులు అక్టోబర్ 25 లోగా అందించాలని సూచించారు. గడువులోగా పూర్తి కావాలని నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందించాలని తెలిపారు. సమావేశంలో సంబంధిత అధికారులు ఉన్నారు.

సేవ చేయాలన్న తపన కలిగించేందుకు సేవ పక్వాడ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సేవ చేయాలన్న తపన ప్రతి ఒక్కరిలో కలిగించేల ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సేవ పక్వాడకు పిలుపునిచ్చారని ఎంపీ నగేష్ అన్నారు. సెప్టెంబర్ 17 నుంచి ప్రారంభమైన సేవ పక్వాడ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కోలిపుర, ఖానాపూర్ చెరువు వద్ద గల బతుకమ్మ ఘాట్ వద్ద గుర్రపు డెక్కను ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి తొలగించారు. అనంతరం అక్కడి ఉమమాహేశ్వర ఆలయంలో పూజలు చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కాలనీకి వచ్చిన ఎంపీ, ఎమెల్యేలను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని మహాత్మ గాంధీ కలలు నిజాం చేయానికి ప్రధాని సేవ పక్వాడకు పిలుపునిచ్చారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఇందులో పాల్గొన్నాయన్నారు. అదే విధంగా అమ్మ పేరిట మొక్క నాటాలని ఇచ్చిన పిలుపులో కూడా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారని తెలిపారు. 70 ఏండ్ల తరువాత ప్రధాని ఇచ్చిన పిలుపులో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములై మద్దతు తెలుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, కౌన్సిలర్ ఆదినాథ్, లాలామున్న, విజయ్ బోయర్, భీంసేన్ రెడ్డి, వేదావ్యాస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలని గతంలో తెలియదా..?

- ఖానాపూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గతంలో కాంగ్రెస్ ఇందిరామ్మ ఇండ్లు మంజూరు చేసిన సమయంలో ఖానాపూర్ చెరువు ప్రాంతంలో అక్రమ నిర్మాణాలని కాంగ్రెస్ నాయకులకు తెలియదా అని ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రశ్నించారు. బుధవారం ఖానాపూర్ చెరువు ప్రాంతంలో అధికారులు సర్వేలు నిర్వహిస్తున్న ఏరియాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. బైక్‌పై కాలనీలో తిరుగుతూ ప్రజలను కలిసి వారికి భరోసా ఇచ్చారు. ఇండ్లు కూలగొట్టకుండా తమ ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా సీఎం రేవంత్ రెడ్డిపై వ్యాఖ్యలు చేసిన గంగన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు భయభ్రంతులకు గురి చేస్తుందన్నారు. ఖానాపూర్ చెరువు పరిసరాల్లో నివాసం ఉంటున్న వారికి అక్రమ కట్టడాలని అధికారులు సర్వే చేస్తుండడంతో వారికి రాత్రిళ్లు నిద్ర ఉండడం లేదన్నారు. గడిచిన తొమ్మిది నెలల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ఇండ్లను కూల్చివేసే పనిలో ఉన్నారని ఆరోపించారు. ఏ పని చేయాలన్న స్పష్టత ఇచ్చిన తరువాతనే ముందుకు సాగాలన్నారు. పేదలకు కష్టం కలిగించేల వ్యవహరిస్తే చూస్తు ఉరుకొబోమని స్పష్టం చేశారు. బాధితులకు ముందు ప్రత్యామ్నం చూపకుండా సర్వే పేరిట ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు లాలామున్న, ఆకులప్రవీణ్, భీంసెన్ రెడ్డి, కృష్ణ, రాజేష్, సతీష్, విజయ్ ఉన్నారు.

భక్తులకు అసౌకర్యం కలిగిస్తే సహించేది లేదు



- బాసరలో దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి
- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నవతెలంగాణ-ముథోల్

బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం సరస్వతి అమ్మవారి క్షేతంలో రాజన్న అతిథి గృహంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం అయితే ఊరుకునేది లేదని ఆలయ అధికారులను హెచ్చరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, ఇతరత్ర సౌకర్యాలు కల్పించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి, భక్తులు రానున్న సందర్భంగా సరస్వతి అమ్మవారి దర్శనం కోసం వేచి చూసే భక్తులకు ఇలాంటి ఇబ్బందులకు గురి చేయకూడదు అన్నారు. క్యూలైన్లలో పాల పంపిణీ, అల్పాహారం పంపిణీ చేయాలని సూచించారు. పోలీసు వ్యవస్థ పటిష్టంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అవసరమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు తెలియజేశారు. భక్తుల వాహనాలకు ఇబ్బందులు కలగకుండా విశాలమైన ప్రాంతంలో పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు విశ్రాంతి కోసం సత్రాల ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి నది స్నాన ఘట్టాల వద్ద భక్తుల పుణ్యస్నానం ఆచరించే సమయంలో గతంలో కంటే ఈసారి పెద్ద ఎత్తున భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాళ్లను నియమించాలన్నారు. ప్రస్తుతం ఎండలు మండుతున్న తరుణంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా, వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల్సిందిగా చెప్పారు.

తక్కువ కాలంలో అధిక దిగుబడి

- టీఎస్ఎం ప్రమోద్ కుమార్

నవతెలంగాణ-నార్నూర్



తక్కువ కాలంలో అధిక దిగుబడిని రాశి సీడ్స్ షిఫ్ట్ బీజీ-2 విత్తనాలు ఇస్తోందని రాశి సీడ్స్ టీఎస్ఎం ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని నాగల్‌కొండ గ్రామంలో ఆర్సర్ అనే రైతు చేనులో రాశి సీడ్స్ నూతన పత్తి రకం రాశి షిఫ్ట్ బీజీ-2 క్షేత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాశి సీడ్స్ షిఫ్ట్ అనే పత్తి రకం తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి నిచ్చే రకం కాకుండా, రసం పీల్చు పురుగులు, తెల్ల దోమలు, తామర పురుగులను సమర్థవంతంగా తట్టుకునే శక్తి ఉందని అన్నారు. అలాగే పత్తి తీయుటకు సులభంగా ఉంటుందని తెలిపారు. రెండు పంటలు తీయోచ్చని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా జడ్జీ ఎంవీ రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలని జిల్లా జడ్జీ ఎంవీ రమేష్ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ యువరాజ, మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో కోర్టు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

చిల్డ్రన్ పార్కులో..

జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్క్‌లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆర్డీఓ మున్సిపాలిటి ప్రత్యేక అధికారి లోకేశ్వరరావు పాల్గొని పరిసరాలు పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా ఉద్యోగులను ఎన్‌హెచ్‌ఏఐ ఉద్యోగులుగా గుర్తించాలి

- కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి



నవతెలంగాణ-నేరడిగొండ

టోల్‌ప్లాజా ఉద్యోగులను ఎన్‌హెచ్‌ఏఐ ఉద్యోగులుగా గుర్తించి, రూ. 26వేల కనీస వేతనాలు చెల్లించాలని టోల్‌ప్లాజా ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నక్క లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని టోల్ ప్లాజా కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రయివేటీకరిస్తుందని అన్నారు. అందులో భాగంగా జాతీయ రహదారులను టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ పేరుతో కంపెనీలకు నిర్ణీత కాలానికి అప్పజెప్పే ఒప్పందాన్ని చేసుకుంటోందని అన్నారు. టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న ఉద్యోగులను, కార్మికులను, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఉద్యోగులుగా తీసుకోవాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టోల్‌ప్లాజా యూనియన్ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి షేక్ అహ్మద్, ఉపాధ్యక్షులు గోవన్‌సింగ్, రమేష్, నాయకులు సురేందర్‌సింగ్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని బెజ్జూర్ పెంచికల్‌పేట్ ప్రధాన రహదారి లోడుపల్లి బొక్కివాగు బ్రిడ్జి వద్ద ముందస్తు సమాచారం మేరకు నాలుగు లారీలలో తరలిస్తున్న పశువులను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని ఘడ్చిరోలి నుండి హైదరాబాద్‌కు నాలుగు లారీలలో అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం వచ్చిందన్నారు. వాహనాలను తనిఖీ చేయగా అందులో మొత్తం 149 పశువులుండగా కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలో గల గోశాలకు తరలించినట్లు తెలిపారు. కాగా అందులో 21 పశువులు చనిపోయినట్టు పేర్కొన్నారు. మహమ్మద్ షఫీ, సోహిద్ షరీఫ్, కృష్ణ బాసిరాం పవర్, నదీమ్ షేక్‌లపై కేసు నమోదు చేశామన్నారు. ఇద్దరు లారీ డ్రైవర్లు పరారీలో ఉన్నట్లు వారిని పట్టుకోవడానికి గాలింపు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రారంభమైన డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డీఎస్సీ నియమాకాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాల పరిశీలన బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. ఈ పరిశీలన కేంద్రాన్ని వరంగల్ ఆర్జేడీ కే.సత్యనారాయణ రెడ్డి, డీఈఓ యాదయ్యతో కలిసి సందర్శించారు. ధ్రువపత్రాల పరిశీలన జరుగుతున్న తీరును సమీక్షించారు, పరిశీలనకు సంబంధించి అధికారులకు సూచనలు చేశారు. అభ్యర్థుల ధ్రువపత్రాల పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. నిబంధనలు మేరకు పరిశీలన పక్కాగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 45 మంది ఎస్జీటీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయినట్లు ప్రకటించారు. ఈనెల 5 వరకు 1:3 నిష్పత్తిలో మెసేజులు వచ్చిన అభ్యర్థుల పరిశీలన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ బాబు, జిల్లా సైన్స్ అధికారి మధుకర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | అక్టోబర్ 03, 2024 | www.navatelangana.com

లక్ష్యాన్ని సాధించడం అభినందనీయం

నవతెలంగాణ-ఉట్నూర్



తాను అనుకున్న లక్ష్యాన్ని జాదవ్ సాయిప్రియ సాధించి, ఎంబీబీఎస్‌లో సీటు పొందడం అభినందనీయమని ఉట్నూర్ సాహిత వేదిక పూర్వ అధ్యక్షుడు శ్రావణ్ రాథోడ్, ప్రచార కార్యదర్శి ఆత్రం మోతీరాం అన్నారు. ఉట్నూర్ సాహితీ వేదిక అధ్యక్షుడు కవన కోకిల జాదవ్ బంకట్ లాల్ కుమార్తె జాదవ్ సాయిప్రియ కరీంనగర్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం పట్ల పలువురు శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.

ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల ప్రారంభం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని పాటగూడలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.35 కోట్లతో నిర్మించిన నూతన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీ డీఎస్సీ వేయాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఏజెన్సీ డీఎస్సీ వేయాలని, గిరిజన సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 17న కుమురం భీం వర్ధంతి సందర్భంగా గ్రామగ్రామాన వర్ధంతి కార్యక్రమాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏజెన్సీ డీఎస్సీ వేయాలని గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కుమురం భీం స్ఫూర్తితో షెడ్యూల్ ప్రాంత పరిరక్షణ, షెడ్యూల్ హక్కుల సంరక్షణకు గ్రామాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. భీం పోరాడిన జల్ జంగల్ జమీన్ ఇప్పటికి ఆదివాసులకు అందని ద్రాక్షలా ఉందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులను మరింత దుర్భర పరిస్థితి నెట్టే విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. వీటికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షులు మడవి నాగోరావ్, భీంరావు, నాయకులు ఆత్రం కిష్టన్న, మేస్రం నర్మదా మహేష్, కనక మలుకు పాల్గొన్నారు.



నూతన జిల్లా కార్యదర్శిగా భీంరావు

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) నూతన జిల్లా కార్యదర్శిగా తొడసం భీంరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆధ్వర్యంలో సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్

ఇటీవల గుడిహత్నూర్‌లో నిర్వహించిన వాలీబాల్ క్రీడా పోటీల్లో గెలుపొందిన ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ టీమ్ క్రీడాకారులకు బుధవారం ఎస్సై మనోహర్ వాలీబాల్ కిట్‌ను అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కష్టపడి చదివి జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. డీఎస్సీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఫలితాలలో జిల్లాకు చెందిన కానిస్టేబుల్ షేక్ ఇంజమాముల్ హక్ చెల్లెలు షేక్ షిరీన్ పర్వీన్ రాష్ట్రంలోనే స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ విభాగంలోని ఉర్దూ మీడియంలో 80.03 మార్కులతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని డీఎస్సీ ఎస్జీటీలో 79 మార్కులతో రెండో స్థానాన్ని సాధించిందన్నారు. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్, డీఎస్సీలలో మొదటి స్థానాలను సాధించిన విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం పోలీస్ కార్యాలయంలో విద్యార్థినిని శాలువాతో సత్కరించి, బహుమతిని ప్రధానం చేసి అభినందించారు. మరిన్ని ఉన్నత లక్ష్యాలను సాధించి కుటుంబ సభ్యుల పేరును జిల్లా పోలీసుల కీర్తిని ఉన్నత స్థానాలకు తీసుకువెళ్లాలని సూచించారు. అన్నయ్య ఒకవైపు ఉద్యోగం చేస్తూ, కుటుంబ బాధ్యతలను మోస్తూ చెల్లెలు చదువుకు కావాల్సిన వాటిని అందిస్తూ తనను ప్రోత్సహించడం జరిగిందని, విద్యార్థిని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ఏఎస్సై జైస్వాల్ కవిత, కుటుంబ సభ్యులు తండ్రి మెహబూబ్, అన్నయ్య షేక్ ఇంజమాముల్ హక్, తమ్ముడు ఇమ్రాన్, నజీర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అసమానతలు లేని సమాజాన్ని సాధించడమే కేవీపీఎస్ లక్ష్యం




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసమానతలు లేని సమాజాన్ని సాధించడమే కేవీపీఎస్ లక్ష్యమని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పవార్ జితేందర్, రెంజర్ల ప్రవీణ్ అన్నారు. బుధవారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 26వ ఆవిర్భావం దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పవార్ జితేందర్ జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1998 అక్టోబర్ 2న ఆత్మగౌరవం సమానత్వం కులనిర్మూలన లక్ష్యాల సాధన కోసం అంటరానితనం కులవివక్షతకు వ్యతిరేకంగా కేవీపీఎస్ ఏర్పడిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కులవివక్ష అంటరానితనంపై వందలాది గ్రామాల్లో వేలాదిమంది కార్యకర్తలచే సర్వేలు అధ్యయనాలు నిర్వహించి సుమారు 128 రకాల కులవివక్ష రూపాలను వెలికి తీసిందన్నారు. ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఏర్పాటు కోసం దశలవారీగా పోరాటాలు నిర్వహించి, జస్టిస్ పున్నయ్య కమిషన్ సాధించిన ఘన చరిత్ర కేవీపీఎస్ సంఘానికి దక్కిందన్నారు. 2004 నుంచి 2013 వరకు సుమారు 10 ఏండ్లు దళిత గిరిజన జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించాలని చట్టం చేయాలని కేవీపీఎస్ అనేక సంఘాలు కలుపుకొని పోరాడి 2013లో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం సాధించిందన్నారు. జిల్లాలో దళితులపైన జరిగిన దాడులు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు ఉద్యమాలు నిర్వహించి, బాధితుల పక్షాన నిలబడిందన్నారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని అన్నారు. దళితులపై జరుగుతున్న దాడులకు అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలుకై పోరాడుతున్నామన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని, పరువు హత్యలను అరికట్టాలని ఉద్యమాలు నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, బ్యూభీం అధ్యక్షులు ప్రేమేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ జిల్లా నాయకులు పూసం సచిన్, ఆత్రం కిష్టన్న, విష్ణు, కె.ఆశన్న, మంజుల పాల్గొన్నారు.

డిగ్రీ అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



నవతెలంగాణ-ఉట్నూర్



వృక్షశాస్త్రంలో మొక్కల పెరుగుదల అనే అంశంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ మరడా శ్రీనివాస్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2014 నుంచి ఆయన బాటని లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతకుముందు మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా విధులు నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వస్తున్నారు. బాటనిలో మొక్కల పెరుగుదల, ఖనిజ పోషణపై ఉపయోగకర సూక్ష్మజీవుల ప్రభావం అనే అంశంపై రాజస్థాన్‌లోని సన్‌రైస్ యూనివర్సిటీలో మంగళవారం డాక్టరేట్ పట్టాను యూనివర్సిటీ డీన్ సభ్యులు అందించినట్టు ఆయన తెలిపారు. డాక్టరేట్ పట్టా అందుకోవడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ సాయిప్రసాద్, అధ్యాపకులు, బాటని లెక్చరర్‌కి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ డాక్టరేట్ చేసేందుకు ప్రోత్సహించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లోకేశ్వరం

మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గడ్చందా గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఒళ్లపు ముత్యం(60) రెండు సంవత్సరాల నుంచి మద్యానికి బానిసయ్యాడు. చిన్నచిన్న విషయాలకు కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మద్యం తాగడానికి భార్యకు డబ్బులు అడగగా అమే ఇవ్వకపోవడంతో ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టూ పక్కల గాలించిన ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో గ్రామ సమీపంలో గల గోవింద చెరువులో శవమై కనిపించాడు. భార్య ఒళ్లపు నాగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యువత మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్





నవతెలంగాణ-ఉట్నూర్

నేటి యువత మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాన్ని ఏకతాటిపై తెచ్చి ఆంగ్లేయుల పాలనను అంతమొందించడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని, ఆయన చేసిన పోరాటాల వల్లె దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. హింసకు తావు లేకుండా మహాత్మా గాంధీ చేసిన పోరాటం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. నేటి యువత ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకొని, ఆయన చూపిన బాటలో నడువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహాన్ని శుద్ధి చేసి, అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, మాజీ ఎంపీపీ సజన్, సర్పంచ్ పెంట వెంకటరమణ, ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సరసాని మహేందర్ రెడ్డి, గాజుల రాజనర్సయ్య, సంతోష్‌సింగ్ పాల్గొన్నారు.

గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే...

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. దేశానికి గాంధీజీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ్, నాయకులు పెంటన్న, మల్లారెడ్డి, లస్మన్న, నర్సయ్య, మల్లేష్, గంగయ్య పాల్గొన్నారు.



ఉట్నూర్ : అహింసాయుత మార్గాన్ని అనుసరించి, దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చి పెట్టిన మహనీయుడు మహాత్మా గాంధీ అని పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ దేశాన్ని ఏకతాటిపై తెచ్చి ఆంగ్లేయుల పాలనను అంతమొందించడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఏడీఎంహెచ్ఓ కుడ్మెత మనోహర్, ఏఓ దామోదర్, పీఎచ్ఓ సందీప్ కుమార్, జెడీఎం నాగభూషణం, పేసా కోఆర్డినేటర్ వసంతరావు, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నార్నూర్ : గాంధీ జయంతి వేడుకలను బుధవారం మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని శ్రీ సేవాదాస్ స్కూల్‌లో, మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో, మెడిగూడ గ్రామ పంచాయతీతో పాటు ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాతిపిత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జాదవ్ ఉమాజీ, దళిత సంఘం నాయకులు మోటేరావ్ అనిల్, మెడిగూడ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ఆనంద్‌రావ్, గ్రామ పటేల్ తెలంగ్‌రావ్, ఉపసర్పంచ్ యశ్వంత్‌రావ్ పాల్గొన్నారు.

తాంసి : తాంసి, భీంపూర్ మండల కేంద్రాల్లోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో స్వచ్ఛ భారత్‌లో భాగంగా గ్రామ వీధుల్లో చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నలంద ప్రియ, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, వివిధ పార్టీల నాయకులు కృష్ణ, గోవర్ధన్ రెడ్డి, రామన్న యాదవ్, పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆయా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తలమడుగు : మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు ప్రయివేట్ వ్యవసాయ సహకార సంఘ భవనంలో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, పీఏసీఎస్ సీఈఓ మోతే శ్రీనివాస్, రెవెన్యూశాఖ, పంచాయతీరాజ్‌శాఖ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి అహింస సత్యాగ్రహ సిద్ధాంతాలను అందించిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు భారతరత్న మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్ నాయక్, నాయకులు షబ్బీర్ పాషా, నయీమ్, జహీర్, మహాజన్ జితేందర్, వాసవి క్లబ్ సభ్యులు, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.









జిల్లా సబ్ జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం సబ్ జైలర్ ప్రేమ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జీ ఎంవీ.రమేష్, సీనియర్ సివిల్ జడ్జీ యువరాజతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీల సంక్షేమ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గాంధీ జయంతి రోజున అహింస లక్ష్యంగా ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఖైదీలు సత్ప్రవర్తన కలిగి జైలు జీవితం ముగించాలన్నారు. అనంతరం ఖైదీలతో కలిసి జైలులో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పీఈటీ విభాగంలో జిల్లా టాపర్ మాచర్ల బాలాజీ

నవాతెలంగాణ-కెరమెరి



రెండు రోజుల క్రితం వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మండల కేంద్రంలోని నెహ్రూ నగర్‌కు చెందిన మాచర్ల బాలాజీ పీఈటీ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. మండల కేంద్రంలోని నవోదయ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేయగా కరీంనగర్‌లో బీపేడ్ పూర్తి చేసి విశాఖలో డీఎస్సీ పరీక్ష కోసం శిక్షణ తీసుకున్నాడు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లను నియమకానికి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వగా దానికి అదనంగా మరి కొన్ని ఉద్యోగ ఖాళీలు జోడించి కాంగ్రెస్ ప్రభుత్వం రీ నోటిఫికేషన్ వేసి పరీక్ష నిర్వహించి ఫలితాలు విడుదల చేసింది. ఈ ఫలితాల్లో మాచర్ల బాలాజీ పీఈటీ విభాగంలో మొదటి ర్యాంకు సాధించి సత్తా చాటాడు. దీంతో నెహ్రూ నగర్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎఫ్‌డీసీ పైలెట్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు(ఎఫ్‌డీసీ) జారీ పైలెట్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి సర్వే బృందాల ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో గల 10వ వార్డు, కెరమెరి మండలంలోని ధనోర గ్రామపంచాయతీ, సిర్పూర్ నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలో గల 14వ వార్డు, సిర్పూర్-టి మండలంలోని వెంకట్‌రావుపేట గ్రామపంచాయతీలను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 3 నుండి 7వ తేదీ వరకు సర్వే పూర్తి చేయాలని, మున్సిపాలిటీలో కమిషనర్, తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బృంద నాయకులుగా గ్రామపంచాయతీలో తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బృంద నాయకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. పీడీఎఫ్ డాటాలో సర్వే నిర్వహించాలని, జాబితాలో ఉన్న పేర్లు, సెల్ నెంబర్ సరిగా ఉన్నాయా అనే విషయాన్ని సరిచూసుకోవాలని, మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లు నిబంధనల ప్రకారం తొలగించాలని తెలిపారు. నూతనంగా వచ్చిన వారి పేర్లు నమోదు చేయాలని, ఉమ్మడి కుటుంబంలో పెళ్లి అయిన వారు ఉంటే వేరువేరుగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అందించనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు వివిధ సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందని, ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా సర్వే చేపట్టాలని ఆదేశించారు. అనంతరం సర్వే విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గాంధీ చూపిన మానవత విలువలు పాటించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

మహాత్మ గాంధీ చూపిన మార్గంలో నడవడంతో పాటు మహనీయుడు తెలిపిన మానవత విలువలు పాటించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన మహాత్మా గాంధీ జయంతి వేడుకలు అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు ఆర్డీఓ లోకేశ్వరరావులతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విషయంలో కూడా మంచిని మాత్రమే చూడాలన్నారు. ప్రతి వ్యక్తి మానవతా విలువలు కలిగి ఉంటే ఇతర వ్యక్తులు కూడా వాటిని పాటించే అవకాశం ఉంటుందన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా సమాజంలోని ఎదుటి వారికి విలువ ఇవ్వాలన్నారు. స్వాతంత్ర సాధన సమయంలో భారతీయులు విద్య నేర్చుకోవాలని గాంధీజీ ఎంతగానో కృషి చేశారని ప్రతి వ్యక్తి ఆ బాటలో నడిచి చదువుకోవడమే ఆయనకు ఇచ్చే గొప్ప నివాళి అన్నారు. సేవా భావంతో ముందుకు వెళ్లాలని జీవితానికి అదే పరమార్థమవుతుందన్నారు. అహింస అనే గొప్ప ఆయుధంతో ఏదైనా సాధించవచ్చని తెలిపిన గొప్ప వ్యక్తి మహాత్ముడని కొనియాడారు. అంతకు ముందు అదనపు కలెక్టర్లు, ఆర్డీఓ మాట్లాడుతూ దేశానికి దేశంలోని నాయకులకు మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేకమందికి గాంధీజీ ఆదర్శప్రాయుడయ్యారన్నారు. మరో గొప్ప వ్యక్తి లాల్ బహదూర్ శాస్త్రీ పుట్టినరోజు కూడా ఇదే రోజు కావడం గర్వకారణం అన్నారు. అంతకు ముందు డీపీఆర్ఓ సంపత్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం వారు పాడిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొలవార్‌లను పీవీటీజీలో చేర్చాలి



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఆదివాసీ భవన్‌లో బుధవారం కొలవార్ సేవా సంఘం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పారేపల్లి పోశం, నేర్పెల్లి సదాశివ్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఆదివాసులకు చెందాల్సిన హక్కులు రావడంలేదన్నారు. కొలవార్‌లను పీవీటీజీలో చేరిపించాలని, ఐటీడీఏ ద్వారా 100 రాయితీపై రుణాలు ఇవ్వాలని ప్రతి మండల కేంద్రంలో రూ.50 లక్షలతో కొలావార్ సంక్షేమ భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ తీర్మానించినట్లు తెలిపారు. ఈనెల 6న కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నేర్పెల్లి బ్రహ్మయ్య, రాష్ట్ర కార్యదర్శి తుమ్మిడి అశోక్, ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి మానేపల్లి లక్ష్మణ్, జిల్లా నాయకులు బిబ్బేర భూమయ్య, కౌటాల, బెజ్జూర్, చింతలమానేపల్లి మండలాల అధ్యక్షులు ఎడ్ల భీమయ్య, పెద్దల శంకర్, మండల నాయకులు పారేపల్లి నరసింహులు, బుర్రి నీలయ్య, యూత్ మండల అధ్యక్షులు ఎడ్ల మహేష్, గ్రామ యూత్ అధ్యక్షులు మేడి సతీష్, గ్రామ పెద్దలు ఆత్రం బక్కయ్య, పెద్దల సంతోష్, చింతపుడి ప్రకాష్, మేకల గొంతు, బండి రాజారాం గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

కుల వివక్ష రహిత సమాజమే లక్ష్యం

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కుల వివక్ష రహిత సమాజమే లక్ష్యమని దానికోసమే తమ సంఘాన్ని ప్రారంభించినట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం 26వ ఆవిర్భావం దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజా సంఘాల కార్యాలయంలో కేవీపీఎస్ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1998 అక్టోబర్ 2న ఆత్మగౌరవం సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాల సాధన కోసం అంటరానితనం కుల వివక్షకు వ్యతిరేకంగా ఒక చారిత్రకవసరంగా కేవీపీస్ ఏర్పడిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుల వివక్ష అంటరానితనంపై వందలాది గ్రామాల్లో వేలాదిమంది కార్యకర్తలతో సర్వేలు అధ్యయనాలు నిర్వహించి సుమారు 128 రకాల కుల వివక్ష రూపాలను వెలికి తీసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు కోసం దశలవారీగా పోరాటాలు నిర్వహించి జస్టిస్ పున్నయ్య కమిషన్ సాధించిన ఘన చరిత్ర తమ సంఘానికి దక్కిందన్నారు. 2004 నుండి 2013 వరకు సుమారు 10 ఏండ్లు దళిత గిరిజన జనాభా దామాషా ప్రకారం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించాలని చట్టం చేయాలని అనేక సంఘాలను కలుపుకొని పోరాడి 2013లో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం సాధించిందన్నారు. మంచిర్యాల జిల్లాలో దళితులపైన జరిగిన దాడులు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రజిలేని పోరాటాలు ఉద్యమాలు నిర్వహించి బాధితుల పక్షాన నిలబడిందన్నారు. దళితులపై జరుగుతున్న దాడులకు అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలుకు పోరాడుతున్నామన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని పరువు హత్యలకు అరికట్టాలని ఉద్యమాలు నిర్వహించిందన్నారు. చర్మకారులు, డప్పు కళాకారులు సమస్యలు సాధన కోసం ఉద్యమించిందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు ప్రసాద్, రామయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టికనంద్, కార్తీక్, నాయకులు తిరుపతి, మనోహర్, నిఖిల్, శ్రావణీ, శ్రీకాంత్, రాజు, మంజుల పాల్గొన్నారు.

నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-బెజ్జూర్



నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం మండల కేంద్రంలోని సలుగుపెల్లి గ్రామంలోని రైతులకు ఒరిస్సాకు చెందిన రూరల్ డెవలప్‌మెంట్ ఫార్మర్స్ ఇంటరేషన్ ఆధ్వర్యంలో బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ సిడాం సాయి దీపిష్ రైతులకు అవగాహన కల్పించారు. 45 కిలోల యూరియా బస్తా 46శాతం నత్రజని ఉంటుందని నానో యూరియాలో కూడా అంతే శాతం నత్రజని ఉంటుందని తెలిపారు. దీంతో మొక్కలు పెరిగే సమయంలో రెండు నుంచి నాలుగు మిల్లీలీటర్ల నానో యూరియాను ఒక లీటర్ నీటితో కలిపి పిచికారి చేయడం వల్ల ఆకుల ద్వారా మొక్కలోకి చేరి ఏపుగా పెరుగుతుందన్నారు. దీంతో రైతులకు బస్తాల మూత తప్పడంతో పాటు త్వరగా పిచికారి చేయడానికి వీలు కలుగుతుందని సూచించారు. సేంద్రియ వ్యవసాయ విధానాన్ని అవలంబించడంతో పంటల దిగుబడి పెరగడంతో రైతులకు లాభసాటిక వ్యవసాయం జరుగుతుందని సూచించారు.

డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలి

నవతెలంగాణ-కౌటాల

ఆటో డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని సీఐ ముత్యం రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరు లైసెన్సు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ రోడ్ టాక్సీ ఎప్పటికప్పుడు రిన్యూవల్ చేసుకోవాలన్నారు. అదే విధంగా లైసెన్స్ లేకుండా ఆటోలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.మధుకర్ ఉన్నారు.



అహింసా మార్గాన్ని అనుసరించాలి

- జిల్లా వ్యాప్తంగా గాంధీ జయంతి వేడుకలు



సిర్పూర్(టి)



ఆసిఫాబాద్ : గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ డీవీ. శ్రీనివాస్



చింతలమానేపల్లి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అహింసా మార్గంలో బ్రిటిష్ బానిస సంకెళ్ల నుండి భారతదేశాన్ని విడిపించిన మహాత్మా గాంధీ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. డీపీఓ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ గొప్పతనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సీఐలు సతీష్, పెద్దన్న, మార్కండేయ, హరినాథ్, జిల్లా పోలీస్ సంఘ అధ్యక్షుడు ఎం.విజయ శంకర్ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో

వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గాంధీచౌక్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు శంకర్, క్లబ్ కోశాధికారి చిలువేరి శ్రీధర్, సభ్యులు ఎకిరాల శ్రీనివాస్, ఆసిఫాబాద్ ఎంఈఓ ఉదయ బాబు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరు వెంకన్న, ఆసిఫాబాద్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావుల శంకర్, నాయకులు రావుల వెంకన్న, ఆదిత్య, గుండా ప్రమోద్, కొడిపాక వేణుగోపాల్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కేశవ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో

మున్సిపాలిటీ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, వార్డ్ అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత సంఘం ఆధ్వర్యంలో

విశ్రాంత సంఘం ఆధ్వర్యంలో జిల్లా సంఘ భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణాగౌడ్ అధ్యక్షతన గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కణచి రమేష్, వైద్య వెంకన్న, సూరు, మధుసూదన్ గౌడ్, సిరాజుల్ హక్, లింగన్న, వెంకటేశం, సత్తెమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో

ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీడీఓ శ్రీనివాస్, సిబ్బంది ఆదిత్య పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ తుకారాం, కార్యదర్శి శ్రావన్, కాంగ్రెస్ కార్యాలయంలో మండలాధ్యక్షుడు గుర్నులే నారాయణ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో గాంధీ జయంతి వేడుకలు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, చంద్రయ్య, సునీల్, సంతోష్, రామకృష్ణ, వినోద్, రవి కిరణ్ పాల్గొన్నారు.

తిర్యాణి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గాంధీజీ జయంతి వేడుకలను ఎంపీడీఓ వేముల మల్లేష్, కార్యదర్శి రాజేశ్వరి, ఎంపీఓ సుధాకర్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను వారి సేవలకు గుర్తింపుగా శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తోట లచ్చన్న, కోఆప్షన్ సభ్యుడు మసాడి రామన్న, ఉపాధి హామీ మేట్లు చైని కృష్ణ కరునాకర్, అల్లాడి రామకృష్ణ, పూజ, సంతోష్, జురి రాకేష్, పారిశుధ్య కార్మికులు గద్దల నరేష్, చిలుక రాములు, రవి, లింగేష్ పాల్గొన్నారు.

కౌటాల : మహాత్మా గాంధీ జయంతి వేడుకలు బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కోట ప్రసాద్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరీ శంకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారం, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాచకొండ శ్రీ వర్ధన్, మాలీ సంఘం జిల్లా అధ్యక్షులు కే రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు, పుల్లూరు సతీష్, నేరెళ్ల సంతోష్, కిరణ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు హకీమ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : గాంధీ జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యనారాయణ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ చూపిన బాటలో ప్రతి ఒక్కరు అహింసా మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డిప్యూటి తహసీల్దార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయకుమార్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్, వీఆర్ఓ పాల్గొన్నారు.

రెబ్బెన : జాతిపిత మహాత్మాగాంధీ, భారత దేశ రెండవ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రీల జయంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రములోని బస్ స్టాండ్ సమీపంలోని అండర్ పాస్ వద్ద స్వాతంత్ర్య సమర యోధులకు జయంతి వేడకలు నిర్వహించారు. అనంతరం స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. ఇందులో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, టౌన్ అధ్యక్షుడు వనమాల మురళీ, మోడెం చిరంజీవి గౌడ్, మండల మైనార్టీ అధ్యక్షుడు ఇమ్రోజ్, మాజీ సర్పంచ్లు పెద్దలు చెన్న సోమశేఖర్, లెండుగురే గంటుమేర, మాజీ ఎంపీటీసీ పెసరి మధునయ్య, మోడెం రాజాగౌడ్, వెంకటేష్,కార్తీక్, బాబాభాయ్, అజ్మీర గణపతి, దుర్గం నందు, గణేష్, తిరుపతి పాల్గొన్నారు. అదే విధంగా గోలేటిలోని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్ రాజ్ శ్రీనివాస్ రావు, ఏరియా కమిటీ సెక్రటరీ మారిన వెంకటేష్, సెంట్రల్ కమిటీ నాయకులు ఓరం కిరణ్, మాంతు సమ్మయ్య, ఆఫీస్ ఇన్‌చార్జి వంగ మహేందర్, నాయకులు కాయిత స్వామి, దుంపల బాపు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ప్రతి ఒక్కరూ గాంధీ అడుగుజాడల్లో నడవాలని ఎంపీడీఓ ఆల్బర్ట్ అన్నారు. మండల కేంద్రంలోని కోదండ రామాలయం ఆవరణలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గాంధీ జయంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు సత్యనారాయణ, రామన్న, నాగేష్, సతీష్, సంతోష్, శ్రీకృష్ణ, సందీప్, బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు నాయకులు పాల్గొన్నారు.



తిర్యాణి



వాంకిడి



పెంచికల్‌పేట్

సీడ్ బాల్స్‌తో పర్యావరణ సమతుల్యం సాధ్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీడ్ బాల్స్‌తో పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆసిఫాబాద్ అధ్యక్షుడు కొలిపాక శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో వాసవి క్లబ్ ఆసిఫాబాద్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులతో తయారు చేసిన 12వేల సీడ్ బాల్స్ అటవీ ప్రాంతంలో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే అవకాశం లేని చోట సీడ్ బాల్స్ ఉపయోగపడతాయన్నారు. దీంతో అన్ని ప్రాంతాల్లో మొక్కలు పెరిగి వాతావరణ సమతౌల్యం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ కోశాధికారి చిలువేరి శ్రీధర్, సభ్యులు ఎకిరాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావుల శంకర్, నాయకులు గుండా ప్రమోద్, కొడిపాక వేణుగోపాల్, రావుల వినయ్, వెంకటేశ్వర్లు, ప్రశాంత్, పత్తి శ్యామ్, గుండా సంతోష్, చిలువేరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ సంస్కృతికి ప్రతిక అయిన బతుకమ్మ వేడుకలు జిల్లాలో బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి పాటలు పాడుతూ వేడుకలు ప్రారంభించారు. మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా ఊరువాడ తేడా లేకుండా బతుకమ్మ వేడుకలు జరగనున్నాయి. జిల్లా కేంద్రంలోని శారదా గణేష్ మండలి వద్ద ప్రత్యేక అలంకరణ చేసి మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు



నవతెలంగాణ-మంచిర్యాల

కేవీపీఎస్ మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలోకుల వివక్ష పోరాట సమితి 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం మంచిర్యాల పట్టణంలోని సంజీవయ్య కాలనీలో నిర్వహించారు. సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్ మాట్లాడుతూ 1998 అక్టోబర్ 2న అంటరాని తనం, కుల వివక్షతకు వ్యతిరేకంగా కేవీపీఎస్ ఏర్పడిందన్నారు. మంచిర్యాల జిల్లాలో దళితులపైన జరిగిన దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు ఉద్యమలు నిర్వాహించమన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం పటిష్టంగా అమలు పరచడానికి పోరాటం చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకురాలు దాసరి రాజేశ్వరి, కేవీపీఎస్ నాయకులు రాజు, అఖిల్, రవి, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత కంటి పరీక్ష

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని సబ్ జైలులో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం లక్ష్మి శ్రీ విజన్ ఐ కేర్ ఉత్కూర్ వారి ఆధ్వర్యంలో జైలు సిబ్బందికి, ఖైదీలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సబ్ జైల్ సుపరింటెండెంట్ డిప్యూటీ జైలర్ స్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గాంధీ జయంతి రోజున ఖైదీల సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటారని, ఈ సందర్భంగా వారికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి శ్రీ విజన్ ఐ కేర్ ఆస్పత్రి నేత్ర వైద్య సహాయ నిపుణులు రాజు, సామాజిక కార్యకర్త అయిల్ల విజయ్ కుమార్, సబ్ జైల్ సుపరింటెండెంట్ డిప్యూటీ జైలర్ స్వామి, జైల్ వార్డర్స్ తిరుపతి, రమేష్, విజయ్, బొమ్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ జయంతి

నవతెలంగాణ-మందమర్రి

మండలంలోని అందుగులపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఆర్‌డీఏ పీడీ కిషన్, ఎంపీడీఓ రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల ఇన్చార్జ్ కడారి జీవన్ కుమార్ లు పాల్గొన్నారు. అనంతరం గ్రామసభ నిర్వహించి ఉపాధి హామీ పథకం పనులను సమీక్షించి నూతన పనులను ప్రారంభించడానికి తీర్మానం చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీరేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్, కరబారి మధు, ఐకెపి సీఏలు, నాయకులు పాషా, రాజయ్య, చిల్లపోష, గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



కాసిపేటలో..

జన్నారం : ప్రతి ఒక్కరూ శాంతియుత మార్గంలో గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని పోనకల్ మాజీ సర్పంచ్ ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు జక్కు భూమేష్ అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో గల విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు.

కార్యక్రమంలో వార్తక సంగం అధ్యక్షుడు వామన్, ఆర్య వైశ్య సంఘం కార్యదర్శి గోపాల్, రమేష్, కోశాధికారి శివరామకృష్ణ పాల్గొన్నారు.

నస్పూర్ : నస్పూర్ కాలనీలోని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మహాత్ముడు గాంధీ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బండి రమేష్, సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పొగాకు రమేష్, ఆర్గనైజ్ సెక్రెటరీ అన్వేష్ రెడ్డి, కేంద్ర కార్యవర్గ సభ్యులు ఎండీ లాల పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : గాంధీజీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీలోని ఐబి వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, వెంకట స్వామి గౌడ్, రాజు, చిన్న రమేష్, మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మహాత్మా గాంధీ, భారత రత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ షేక్ సప్దర్ ఆలీ, సూపరింటెడెంట్ అల్లూరి లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంఆర్ఐ శ్వేతరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, ఉస్కమల్ల గోపాల్, గంగాధరి రాజేశం, బుగ్గ రాజు, పానగంటి తిరుపతి, బన్న శ్రీనివాస్, ఉస్కమల్ల రాజలింగు పాల్గొన్నారు.



మందమర్రిలో..

కార్మికులకు ప్రమాద భీమా పత్రాల పంపిణీ

పెద్దనపల్లి గ్రామ పంచాయతీ సిబ్బందికి రూ.10 లక్షల ప్రమాద భీమా పత్రాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈజీఎస్ పథకంకు సంబంధించి 2025 2026 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించే పనులకు సంబంధించి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పర్యవేక్షకులు అల్లూరి లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ సర్పంచ్ వేముల కృష్ణ పాల్గొన్నారు.



జన్నారంలో..



కాసిపేట గ్రామ పంచాయతీలో కార్మికులకు ప్రమాద భీమా పత్రాల అందజేత

మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు



నవతెలంగాణ-దండేపల్లి

గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మత్తు పదార్థాల నిర్మూలణ' ఆవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత పెడదారి పడుతున్నారన్నారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, వారి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు మండల కేంద్రంలో గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో రూ.కోటి 40 లక్షలతో పాఠశాల మరమ్మత్తు పనులు మౌలిక సదుపాయాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, మంచిర్యాల డీసీపీ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని బెల్లంపెల్లి చౌరస్తాలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలిలకు గాయాలు కాగా ఒకరు పరిస్థితి విషమంగా ఉన్నట్లు పట్టణ ఎస్ఐ సనత్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారంకు చెందిన, కొలిపాక రాజన్న(మెస్త్రి) నస్పూర్ మండలం సీతరాంపల్లేకు చెందిన జాడి కవిత(కూలి) ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై ఏసీసీ వైపు ఓ నూతన భవన నిర్మాణం పనులు చేసేందుకు వెళ్తుండగా వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొనడంతో రాజన్నకు తీవ్ర గాయలు కాగా కవితకు స్వల్పగాయలు అయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానికులు మెరుగైన చికిత్సకు కరీంనగర్ తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహాత్మాగాంధీ జయంతి వేడుకలు

జైపూర్ : భీమారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సంధర్భంగా ఈజీఎస్ అదికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో పనుల గుర్తింపు లేబర్ బడ్జెట్ తయారు చేశారు..స్వచ్చతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ పరిధిలో శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తితో పాటు ఈజీఎస్ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

మండలంలో ఇద్దరికీ ఎంబీబీఎస్ సీటు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పొనకల్‌కు చెందిన దుమల్ల నాగమణికి ఎంబీబీఎస్ సీటు సాధించింది. నీట్‌లో రాష్ట్రస్థాయిలో 5864 ర్యాంకు పొంది నిర్మల్ మెడికల్ కాలేజీలో ఆమెకు సీటు వచ్చింది. అలాగే మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన బాణావ వినీత్ కుమార్ 3666 ర్యాంకు సాధించి రామగుండంలోని సింగరేణి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. నాగమణి పొనకల్ వాసి దుమల్ల ఎల్లయ్య, సరిత దంపతుల పెద్ద కుమార్తెనా ఆమె చిన్నప్పటి నుంచిఎంతో చురుగ్గా చదువుకుంటూ మంచి మార్కులు సాధించేది. ఆమె ఒకటి నుంచి 4వ తరగతి వరకు గ్రామంలోని పొనకల్ ప్రాథమిక పాఠశాలలో చదివి, ఆ తర్వాత నిర్మల్ కేంద్రంలోని టీఎస్ఆర్‌జేసీ(డబ్ల్యూ)లో 5వ తరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ లక్షెట్టిపేటలోని టీఎస్ఆర్‌జేసీ(డబ్ల్యూ) చదువుకుంటూ నిట్‌లో ర్యాంకు సంపాదించింది. ఈ మేరుకు కౌన్సిలింగ్ ద్వారా ఎంబీబీఎస్ సీట్లు కేటాయించగా, ఆమెకు నిర్మల్ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ఈ మండలంలోని చింతగూడకు చెందిన బానావత్ వినీత్ కుమార్ ఎంబీబీఎస్ సీటు సాధించాడు. నీట్ లో రాష్ట్రస్థాయిలో 3666 ర్యాంకు పొంది పెద్దపల్లి జిల్లాలోని రామగుండం సింగరేణి మెడికల్ కాలేజీలో తనకు సీటు వచ్చింది. చింతగూడగు చెందిన బానావత్ తిరుపతి, సుమలత దంపతుల పెద్ద కుమారుడైన వినీత్ చిన్నప్పటి నుంచి ఎంతో చురుగ్గా చదువుకుంటూ మంచి మార్కులు సాధించాడు. అతను ఒకటి నుంచి 5వ తరగతి వరకు మండలంలోని జయారాణి హైస్కూల్‌లో చదివి, ఆ తర్వాత కాగజ్‌నగర్‌లో నవోదయలో 6 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు కాలేజీలో చదివి నీట్ రాసి ర్యాంకు పొందాడు. ఈ మేరుకు కౌన్సిలింగ్ ద్వారా ఎంబీబీఎస్ సీట్లు కేటాయించగా, అతనికి పెద్దపల్లి జిల్లాలో కాలేజీలో సీటు కేటాయిం చారు. సందర్భంగా వారిని మండల అంబేత్కర్ యువజన సంఘం అధ్యక్షులు భరత్ కుమార్ కాసెట్టి లక్ష్మణ్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ముత్యం సతీష్, మామిడిపల్లి ఇందయ్యా మేకల మాణిక్యం, ఈ రుణాల గంగన్న, దుమల రమేష్, సత్యనారాయణ, రాజన్నలు వారిని పూలమాలలతో శాలువాతో సత్కరించారు.

నేర ప్రవృత్తిని వీడి సన్మార్గంలో పయనించాలి

- తాండూర్ సీఐ కుమార స్వామి



నవతెలంగాణ-తాండూర్

పాత నేరస్తులు వారి నేర ప్రవృత్తిని విడనాడి సన్మార్గంలో పయనించాలని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. బుధవారం తాండూర్ పోలీసు సర్కిల్ కార్యాలయ ఆవరణలో పాత నేరస్తులు, రౌడీషీటర్లకు జీవిత విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేర ప్రవత్తి మానుకొని సన్మార్గంలో నడవాలని సూచించారు. దీమమ తెలిసి తెలియక జరిగిన కొన్ని ఉదంతాల వల్ల నేరస్తులుగా గా ముద్రించబడ్డారని నేర చరిత్ర మాని సన్మార్గంలో నడిచేందుకు పోలీసు శాఖ సహకారాలు అందిస్తామన్నారు. పోలీసు శాఖ వారి సూచనలు పాటించకుండా పాతదారిలో వెళితే పీడీ యాక్ట్ అమలు చేయడం జరుగుతుందన్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు సమాజంలో మంచి పేరు సంపాదించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. క్షణికావేశంలో చేసిన నేరానికి కుటుంబ సభ్యులు సమాజంలో ఇబ్బందులు పడతారని అన్నారు. రౌడీషీటర్లు తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని జీవితంలో మారాలని హితవు పలికారు. రౌడీషీటర్ అనే పదం తమ బిడ్డల భవిష్యత్‌ను నాశనం చేస్తుందన్నారు. నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. రౌడీ షీటర్ ఉన్న ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీ షీట్ రికార్డ్‌లో వారు చేసే మంచి పనులు కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు. పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించేందుకు కూడా అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, కన్నెపల్లి ఎస్ఐ గంగారాం పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు బీమా పత్రాలు అందజేత

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పోన్కల్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి, కార్మికులకు ఎంపీడీఓ శశికళ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి, కార్మికులకు చేయించిన ఇన్సూరెన్స్ పత్రాలను అందించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్ర కీలకమన్నారు.

తాగుడుకు బానిసై మృతి

నవతెలంగాణ-కాసిపేట

పోలీస్‌స్టేషన్ పరిధిలోని ట్యాంక్ బస్తీకి చెందిన భూక్య లాలు(43) తాగుడుకు బానిసై మృతి చెందాడని కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. భూక్య లాలు తన కుటుంబాన్ని వదిలిపెట్టి ఇక్కడే కూలి పని చేసుకుంటూ తాగుడుకు బానిసై ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడన్నారు. ఇంట్లో మృతి చెందగా పక్కవారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తాగుడుకు బానిసై మృతి చెందాడని, మృతిపై ఎలాంటి అనుమానం లేదని కుమారుడు అరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని విదాల అభివృద్ధి చేస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు తెలియజేశారు. బుధవారం మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా మంచిర్యాలలోని గాంధీ పార్క్‌లో గల మహాత్మ గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి మహాత్మ గాంధీ అని పేర్కొన్నారు. మహాత్మ గాంధీ శాంతి యుత పోరాటంతో స్వాతంత్రం సిద్ధించింది అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేష్, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ ఆదేశించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం జైపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయలంలో పారిశుధ్య కార్మికులను శాలువాలతో సన్మానించడంతో పాటు బీమా కార్డులు అందజేశారు. అంతకు ముందు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తించి, లేబర్ బడ్జెట్ తయారు చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ 2025-26) విషయమై గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చర్చించారు. స్వచ్చతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులు, గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి శ్రమదానం చేశారు. వార్డుల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందారంలో..

మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఇందారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీపతి బాపురావు ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఈజీఎస్ పనుల గుర్తింపు, లేబర్ బడ్జెట్ తయారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి పనుల ప్రణాళికలు తయారు చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్మికులను సన్మానించడంతో పాటు బీమా కార్డులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీపతి బాపు రావుతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇనుప గాడర్‌ల దొంగతనం

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో 140 ఇనుప గార్డర్లు దొంగతనానికి గురయ్యాయి. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ... మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా వంట షెడ్డు నిర్మాణం కోసం 140 ఇనుప గార్డర్లలను తీసుకువచ్చారు. అనివార్య కారణాల వలన షెడ్డు నిర్మాణం జరగలేదు. ఇనుప గార్డర్లను ఆలయ ప్రాంగణంలో ఒకవైపు నిల్వ ఉంచారు. ప్రతినిత్యం ఆలయ కమిటీ దర్శనానికి వెళ్లి వాటిని పరిశీలిస్తూ ఉండేవారు. ఈ క్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి తక్కల్లపల్లి రాజేశ్వరరావు మంగళవారం ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకున్న అనంతరం పరిసరాలు పరిశీలించారు. ఇనుప గడర్లు కనిపించలేదు. దీంతో విషయం కమిటీ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇనుప గార్డర్ల విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందన్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి తక్కలపల్లి రాజేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | అక్టోబర్ 03, 2024 | www.navatelangana.com

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్



ఉపాధి హామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జవహర్‌లాల్, ఏపిఓ జాదవ్ సురేష్ అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా మహాగావ్ గ్రామ పంచాయతీ రైతువేదికలో రైతులతో ఉపాధి హామీ చట్టం పనులపై గ్రామసభ నిర్వహించి అవగాహన కల్పించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన కొత్త పనులపై బడ్జెట్ పనులపై ప్రణాళిక తయారు చేస్తామన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చాలన్నారు. ఉపాధి హామీ చట్టంలో భాగంగా రైతులు పొలంలో చేపట్టాల్సిన పనులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టీఏ కైలాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ రైతులు ఉన్నారు.

సౌత్ జోన్ క్రీడా పోటీలకు డిగ్రీ విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఉట్నూర్



సౌత్ జోన్ ఇంటర్ కళాశాల ఫుట్ బాల్ టోర్నమెంట్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్, పీడీ అనిత తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 29, 30, మంగళవారం వరంగల్ జిల్లా కేంద్రంలో ఇంటర్ కళాశాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరిగిందనీ, దీనికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో మూడో సంవత్సరానికి చెందిన విద్యార్థి కొట్నాక్ సచిన్ అత్యంత ప్రతిభ కనబర్చడంతో సౌత్ జోన్ ఇంటర్ కాలేజీ ఎట్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కి ఎంపికయ్యాడని తెలిపారు. దీంతో కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థినిని అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ నర్సింగ్ రావు, అధ్యాపకులు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో బాగంగా కడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధించడం అందరూ బాధ్యతగా తీసుకొని, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు. మనం కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు దుకాణదారుడు ఇచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయటం వలన ప్లాస్టిక్ భూమిలో కలిసిపోక భూమి కలుషితం అవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అంతకుముందు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ అరుణ, ఎంపీఓ కవిరాజ్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు వాజీద్ ఖాన్, సింగల్ విండో డైరెక్టర్‌లు గొల్ల వెంకటేష్, పడిగెల భూషణ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, ఖానాపూర్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకాల శ్రీను, మండల మైనార్టీ అధ్యక్షులు బబ్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, రహీం, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి డిజిటల్ కార్డుల సర్వే..

- పైలట్ ప్రాజెక్టు కింద ఇంటింటికి తిరగాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఈ నెల 3 నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టు కింద మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ గ్రామంలో కుటుంబాల వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. దీనికి సంబంధించి తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, మున్సిపల్ అధికారులను టీమ్ అధికారులుగా వీరితో పాటు ఇద్దరు సిబ్బందిని నియమించామని తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు ఇవ్వాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అర్బన్ వార్డు, గ్రామపంచాయతీని పైలెట్ ప్రాజెక్ట్‌గా సర్వే బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ కమిషనర్లు డిజిటల్ కార్డుకు సంబంధించి, పైలట్ ప్రాజెక్ట్ క్రింద వార్డు, గ్రామ పంచాయతీలలో పూర్తిస్థాయిలో కుటుంబ డిజిటల్ కార్డుకు సంబంధించిన పరిశీలన మొత్తం పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, జిల్లా వ్యాప్తంగా ఈ అంశాన్ని అదనపు కలెక్టర్, ఆర్‌డీఓ సమన్వయంతో పర్యవేక్షించాలని అన్నారు. ప్రజలు అందుబాటులో ఉండే సమయంలో సర్వేకు వెళ్ళే విధంగా ప్లాన్ చేసుకోవాలని తెలిపారు. కుటుంబ సర్వే అంగన్‌వాడీ టీచర్లకు తెలిసి ఉంటుందని, వారి సహకారం తీసుకోవాలని, కుటుంబ ఫోటో మొబైల్ ఫోన్‌లో తీసుకోవాలని, ఫార్మాట్‌లో ఇచ్చిన ప్రకారం డేటాలో పూర్తి వివరాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ నెల 8నాటికి సర్వేను పూర్తి చేయాలని అన్నారు. 9న స్క్రూటినీ జరిపి, 10న సర్వేకు సంబంధించిన అన్ని అంశాలతో సమగ్ర నివేదిక పంపించాలని ఏ ఒక్క కుటుంబం సైతం తప్పిపోకుండా సర్వేను పకడ్బందీగా నిర్వహించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయాలి

భూముల క్రమబద్దీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు లేఅవుట్ క్రమబద్దీకరణ పథకం కింద దరఖాస్తు చేసుకున్న పెండింగ్‌లో ఉన్న 1600 దరఖాస్తులను ప్రతీ రోజూ 20 దరఖాస్తులు క్లియర్ చేయాలని అన్నారు. ఈ నెల 9వ తేదీలోగా క్లియరెన్స్ చేయాలని, అక్టోబర్ 9 నుంచి 31 వరకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. సలహాలు సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్‌కు ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ టోల్ ఫ్రీ నెంబర్ 9441019479, 8019337150 కాల్ చేయాలని, కలెక్టరేట్ ఏఓ రామిరెడ్డిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, ఏంఆర్ఓలు, పంచాయతీ సెక్రటరీలు ఉన్నారు.

ఏకలవ్య ఆదర్శ పాఠశాల ప్రారంభం

నవతెలంగాణ-ఉట్నూర్

ఏకలవ్య ఆదర్శ పాఠశాలను జార్ఖండ్ రాష్ట్రంలో వర్చువల్‌లో పీఎం నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించారు. బుధవారం ఉట్నూర్ ఏకలవ్య పాఠశాలలో ముఖ్యఅతిథిగా ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా పాల్గొన్నారు. మోటో ద్వారా రూ.35 కోట్ల నిధులతో పది ఎకరాలలో 2021లో మొదలు పెట్టారని అన్నారు. మొదటి విడతలో రూ.20కోట్లతో పాఠశాల భవనం, బాలురు, బాలికల వేరు వేరు హాస్టల్, డైనింగ్ హాల్, వార్డెన్ క్వార్టర్స్‌లు నిర్మించారని తెలిపారు. రెండో విడతలో రూ.15కోట్లతో ప్రిన్సిపాల్ క్వార్టర్స్‌ల భవనాలు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. 6 వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కో-ఎడ్యుకేషన్‌లో సీబీఎస్ ఈ సిలబస్ విద్యను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్, ఏపీఓ వసంతరావు, ఆర్సీఓ అనిల్, ప్రిన్సిపాల్ అరవింద్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బయలుదేరిన విద్యార్థులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేటి నుండి నారాయణపేట జిల్లాలోని సోగ్ని పట్టణంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్-17 హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనా రెడ్డి మాట్లాడుతూ నేటి నుండి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో గిరిజన ఆదర్శ క్రీడ పాఠశాలలో చదువుతున్న ఏడు మంది విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోటీలకు బయలుదేరి విద్యార్థులకు డీటీడీఓ రమాదేవి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, ఏసీఎంఓ పీ.ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, పీడీ మంగ, పీఈటీ రాకేష్, సుమ, కోచ్లు అరవింద్, విద్యాసాగర్, తిరుమల్, హెచ్‌డబ్ల్యూఓ సాయిబాబా పాల్గొన్నారు.

సెయింట్ మేరీ నుండి ఇద్దరు ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కాగా వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లిబిన్, పాఠశాల పీడీ కడతాల రాకేష్, పీఈటీలు కిరణ్, అర్చంకుమారి, ఆత్రం బద్రి పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

నవతెలంగాణ-రెబ్బెన

ఖైరగూడ ఓపెన్ కాస్టులో మట్టిని తరలిస్తుండగా టీటీసీ ట్రాన్స్ పోర్ట్ లారీ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవర్ మహేష్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్‌ను గోలేటి డిస్పెన్సరీకి తరలించి చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ కార్మికుని పరామర్శించారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందన్నారు. కార్మికునికి మెరుగైన వైద్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఏఐటీయూసీ నాయకులు సాగర్ గౌడ్, బీజేపీ నాయకులు ఆంజనేయులు గౌడ్ ఉన్నారు.

ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపిన మహానీయుడు గాంధీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంతో పాటు ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపిన మహానీయుడు మహాత్మ గాంధీ అని ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీ చౌక్‌లో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశ మాజీ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ నీతి నిజాయితీకి నిలువు మహాత్మ గాంధీ అని కొనియాడారు. స్వతంత్ర్య ఉద్యమంలో అందరిని ఏకం చేసి అహింస, సత్యాగ్రహంతో దేశ ప్రజలను ఐక్యం చేశారన్నారు. హంగులు ఆర్భాటలకు పోకుండా దేశం కోసం జీవించిన వ్యక్తి అని అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రీ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన ఘటనకు బాధ్యత వహిస్తు తన పదవీకి రాజీనామ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో ఎన్నో కుంభ కుణాలు, నేరుగా దొరికిపోయిన పదవులు వీడటం లేదన్నారు., మహాత్మ గాంధీలాంటి నిజాయితీ గల నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అహింసాతో సాధించలేనిది ఏది లేదని చెప్పిన మహానీయుడు మహాత్మ గాంధీ అని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గాంధీ చౌక్ సుందరీకరణకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటుకు ముందుకు వస్తున్నట్టు తెలిసిందని, మిగిత కార్యక్రమాలను ప్రభుత్వ పరంగా నిర్వహించేల చూస్తానన్నారు. వీటి కోసం అందరితో కలిసి కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు లాలామున్న, బీంసెన్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్, హరిష్, నర్సింములు, గిరిష్, ప్రసాద్, ఉల్లాస్, నాయకులు పాల్గొన్నారు..

నివాళులర్పించిన మున్సిపల్ చైర్మెన్..

మహాత్మ గాంధీ చూపిన అహింస మార్గంలోనే పయనించాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గాంధీ చౌక్‌లో గాంధీ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించినంతరం పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గాంధీ పార్క్‌లో గాంధీజీకి పూలమాలు వేసే నివాళులర్పించి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు మున్సిపల్ కార్మికులను ఘనంగా సత్కరించారు. అలాగే ఇంద్ర ప్రియదర్శిని స్టేడియం పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛ పరిశుభ్రత చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో గాంధీ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా పలువురు మున్సిపల్ కార్మికులను చైర్మెన్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ ఖమర్ అహ్మద్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్, హరిష్, నర్సింములు, లయన్స్ క్లబ్ కింగ్స్ అండ్ కాటన్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్ పుప్పాల నరేందర్, సత్యనారాయణ, గంగయ్య, రవీంద్ర, గిరిష్ ప్రసాద్, ఉల్లాస్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్



కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. గాంధీ చౌక్‌లో ఆర్యవైశ్య సంఘ వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింస మార్గాన్ని అవలంబిస్తు ముందుకు సాగాలని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. పేదలకు అండగా ఉంటూ వారికి సేవలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండారి సతీష్, గిమ్మ సంతోష్, షకిల్, మంచికట్ల ఆశమ్మ, ప్రేమల పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు. బుధవారం పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రహీం, రమేష్, గణేష్, పాషా, సుభాష్, నర్సారెడ్డి, రాము, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : నేహ్రు యువ కేంద్రంలో ఆధ్వర్యంలో..

నేహ్రు యువ కేంద్రంలో ఆధ్వర్యంలో..

నేహ్రు యువ కేంద్రంలో ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని బీసీ స్టడీ సర్కిల్లో స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సెప్టెంబర్17 నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు స్వచ్ఛ తా హీ సేవ కార్యక్రమాలను చేపట్టామని ఎన్‌వైకే యూత్‌అఫీసర్ సుశీల్ బర్డ్ అన్నారు. ఇందులో పరిసరాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు ప్రవీణ్, రమేష్, సిబ్బంది మజీద్, నరేష్, ఎర్రమ్మ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతి వేడుకలను ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాలలో ఆవరణలో స్వచ్ఛ తా హి సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం, రఘు గణపతి, ఎన్ఎస్ఎస్ పీఓ పృథ్వీ, ఎన్‌సీసీ కేర్ టేకర్ చంద్రకాంత్, కళాశాల సిబ్బంది, క్యాడట్లు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కిసాన్ సెల్ ఆధ్వర్యంలో..

అహింసే ఆయుధంగా దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహానీయుడు మహాత్మా గాంధీ అని, ఆయన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మహాత జయంతిని పురస్కరించుకుని గాంధీ చౌక్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముడు చేసిన సేవలను కొనియాడుతూ నినాదాలు చేశారు. అనంతరం భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మగాంధీ తన అహింస సిద్ధాంతంతో రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించి వారిని దేశం నుంచి తరిమే వరకు పోరాడిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తడిసేన వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేష్, సీనియర్ నాయకులు సవిన్ రెడ్డి, రహీమ్ ఖాన్ ఉన్నారు.

బోథ్ : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం జాతీపిత మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మెన్ భోడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులు జాతీపిత అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, పీఏసీఎస్ డైరెక్టర్ గొర్ల రాజు యాదవ్, నాయకులు మెరుగు భోజన్న, వి.రాజశేఖర్, కురుమే గంగారాం, గడ్డం సురేందర్, షేక్ అబూద్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : సీపీఐ ఆధ్వర్యంలో...



ఆదిలాబాద్‌టౌన్ : డిగ్రీ కళాశాలలో...



బోథ్